క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దొనకొండ: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ షేక్ నాగూర్‌వలి తెలిపారు. దొనకొండ టౌన్, సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో అంతరాయం ఉంటుందని, ప్రజలు గమనించి సహకరించాలని ఏఈ కోరారు.

నేటి నుంచి వైకుంఠ రామాలయ ప్రతిష్ట మహోత్సవం


విఠలాపురం రామాలయం

తాళ్లూరు: మండలంలోని విఠలాపురంలో బుధవారం నుంచి వైకుంఠ రామాలయ ప్రతిష్ట మహోత్సవం ప్రారంభించినట్లు ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. చైత్ర శుద్ధ ద్వాదశి 9వ తేదీ బుధవారం నుంచి చైత్ర బహుళ పాఢ్యమి 13వ తేదీ ఆదివారం వరకు శిలా నిర్మిత నూతన ఆలయంలో శ్రీ సీత లక్ష్మణ హనుమంతు సమేత శ్రీరామచంద్రమూర్తి విగ్రహ ప్రతిష్ట, బొడ్రాయి ప్రతిష్ట మహోత్సవం జరగనున్నట్లు చెప్పారు. భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు, శ్రీరామ భక్త బృందం కోరింది.

బాధిత రైతుకు న్యాయం చేస్తాం


పంట పొలాలు పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

ముండ్లమూరు (దర్శి): విత్తనాలను పరీక్షించి పంట నష్టపోయిన రైతుకు న్యాయం చేస్తామని ఏవీకే హెడ్ అండ్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ రమేష్ అన్నారు. మొక్కజొన్న పంటలో కల్తీ విత్తనాలతో నష్టపోయానని మండలంలోని కంభంపాడు రైతు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేవీకే శాస్త్రవేత్తలు మంగళవారం పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఆర్ఎస్ హెడ్ డాకర్ట్ పి.సంధ్యారాణి, ఏడీఏ బాలాజీ నాయక్, వ్యవసాయాధికారి ఫారుక్‌లు మొక్కజొన్న పంటను పరిశీలించారు. ప్రస్తుత పంట దశ, వాటిలో సరిగ్గా కండెలు రాని మొక్కలు పరిశీలించారు. రైతు సాగు విధానాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ పూర్తి నివేదికను ప్రభుత్వానికి అందిస్తామన్నారు. రైతు నష్టపోకండా న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకుడు ఆనంద్ పాల్గొన్నారు.

సీసీ కెమెరాలపై పోలీసులకు అవగాహన


పోలీసులతో మాట్లాడుతున్న ఎస్ఐ మల్లికార్జునరావు

తాళ్లూరు: స్థానిక పోలీసుస్టేషన్లో మంగళవారం ఎస్సై మల్లికార్జునరావు సీసీ కెమెరాలపై పోలీసు సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న గుడులు, మసీదులు, చర్చిలు, అలాగే జాతీయ నాయకులు, స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి భద్రత కల్పించాలన్నారు. అలాగే గ్రామాల్లో ఒంటరిగా నివసించే వారికి సిబ్బంది అందుబాటులో ఉండాలని చెప్పారు. వేసవి కాలంలో దొంగతనాలు అధికంగా జరిగే అవకాశం ఉందని, వాటిని అరికట్టేందుకు పోలీస్ సిబ్బంది కృషి చేయాలన్నారు. ఏఎస్ఐ మోహన్‌రావు, హెడ్ కానిస్టేబుల్ రమేష్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

జీవనోపాధుల ప్రణాళిక సిద్ధం చేయండి

మార్కాపురం: స్వయం సహాయక సంఘాల సభ్యుల రుణ, జీవనోపాధుల ప్రణాళిక వాస్తవ అంచనాలకు తగినట్లు ఉండేలా తయారు చేయాలని డీఆర్‌డీఏ పీడీ టి.నారాయణ అన్నారు. జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న స్వయం సహాయక సంఘాల సభ్యుల రుణ ప్రణాళిక నమోదు ప్రక్రియలో భాగంగా మంగళవారం ఆయన మార్కాపురం, మద్దిపాడు, తాళ్లూరు, ముండ్లమూరు, కురిచేడు, దొనకొండ మండలాల్లో జరుగుతున్న ప్రక్రియను పరిశీలించారు. అనంతరం మార్కాపురం కార్యాలయంలో మాట్లాడారు. గతంలో ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు రుణాలతో పాటు స్త్రీనిధి నుంచి కూడా రుణ సదుపాయం అందించిందన్నారు. జీవనోపాధుల ద్వారా ఆదాయ భృతికి కావాల్సిన పెట్టుబడి రుణ ప్రణాళిక తయారు చేసుకుంటే ద్వారా అవసరమైన సమయాల్లోనే రుణాలు పొందే వీలుంటుందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 45 వేల సంఘాల్లోని 4.50 లక్షల మంది సభ్యుల నుంచి సమాచారం సేకరించామన్నారు. ప్రతి ఒక్కరికీ అవసరమైనప్పుడు రుణం అందించేలా ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. తీసుకున్న ప్రతిరూపాయి సద్వినియోగం అయ్యేలా చూడాలని, తప్పుడు సమాచారం నమోదు చేయవద్దని సూచించారు. అనంతరం వేములకోట పంచాయతీ కొట్టాలపల్లిలోని సంఘ సభ్యులతో మాట్లాడారు. ఆయన వెంట ఏపీఎం పిచ్చయ్య ఉన్నారు.

ఉపాధి కూలీలకు వసతుల కరువు

- ఎండలకు ఎండుతున్న కూలీలు
- కనిపించని సహాయక చర్యలు
- పట్టించుకోని అధికారులు


పుల్లలచెరువులో కుంట పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

పుల్లలచెరువు: స్థానికంగా పనులు కల్పించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఉపాధి హామీ పనులు అసౌకర్యాల నడుమ సాగుతున్నాయి. రోజు రోజుకూ ఎండలు పెరుగుతున్నాయి. ఇంటి నుంచి బయటకు రావాలంటే ఉదయం నుంచే ప్రజలు భయపడుతున్నారు. ఈ క్రమంలో గ్రామాల్లో పనిచేస్తున్న ఉపాధి పనులు చేసే కూలీలు ఎండలకు ఇబ్బందులు పడుతున్నారు. వారికి పని ప్రదేశంలో వసతులు కల్పించడంలో ప్రభుత్వంతో పాటు అధికారులు విఫలమయ్యారు. ఎండలకు కూలీలు సొమ్మసిల్లిపోతున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే కనీసం ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో లేకపోవడం విచారకరం.

చివరి దశలో వ్యవసాయ పనులు

యర్రగొండపాలెం నియోజకవర్గంలోని ఐదు మండలాలు పుల్లలచెరువు, దోర్నాల, పెద్దారవీడు, యర్రగొండపాలెం, త్రిపురాంతకంలో వ్యవసాయ పనులు చివరి దశకు చేరాయి. ఆయా మండలాల్లోని వివిధ గ్రామాల్లో ఉపాధి పనులు ప్రారంభించారు. దీంతో గ్రామాల్లో కూలీలు చెరువు పూడికతీత, కుంటలు తీయడం, పశువుల గుంతలు తదితర పనులు చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో ఇతర పనులు ఎక్కడా దొరక్కపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లోని కూలీలు తప్పనిసరి పరిస్థితుల్లో ఉపాధి పనులపైనే ఆధారపడాల్సి వస్తోంది. పనిచేసే ప్రదేశంలో ఎక్కడా వసతులు లేకపోవడంతో పనిచేసే కూలీలు ఎండల తీవ్రతకు అల్లాడిపోతున్నారు. గతంలో టార్పాలిన్ పట్టలతో గుడారాలు వేసేవారు. తాగునీటి సౌకర్యం కల్పించే వారు. పనులు చేసే ప్రదేశంలో ఓఆర్ఎస్ ప్యాకెట్‌లు, ప్రథమ చికిత్స కిట్‌లు అందజేసేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి కూలీల గురించి పట్టించుకోవడం లేదు. దీనికి తోడు కొత్త నిబంధనలు తీసుకు రావడంతో కూలీలకు దిక్కుతోచని పరిస్థితి ఎదురవుతోంది. రెండు పూటలా ఫొటోలు తీసి మస్టర్ నమోదు చేయాలని మెలిక పెట్టడంతో అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. పనిచేసే ప్రదేశంలో సరైన వసతులు లేకపోవడంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పుడు ఎండలు ఇలా ఉంటే మే నెలలో పనులు ఏలా చేయాలని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం అధికారులకు తెలిపినా ఏం చేయలేని పరిస్థితి నెలకొంది.

మండలాల వారీగా కూలీల వివరాలు

మండలం	జాబ్ కార్డులు	కూలీలు	రోజూ పనిచేస్తున్న కూలీలు
పుల్లలచెరువు	19,691	29,170	8,217
పెద్దారవీడు	13,392	25,269	5,913
యర్రగొండపాలెం	19,231	33,228	8,593
త్రిపురాంతకం	17,535	31,428	8,082
దోర్నాల	13,792	20,535	5,308

అధికారులకు తెలియజేశాం

ప్రస్తుతం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పని ప్రదేశాల్లో సౌకర్యాల కల్పనపై ఉన్నతాధికారులకు తెలియజేశాం. వారి ఆదేశాలు వచ్చే వరకు కూలీలకు మౌలిక వసుతులు కల్పించమని మేస్త్రిలకు చెప్పాం. కూలీలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.

మోషే, ఏపీవో, పుల్లలచెరువు

మంచినీరు లేక ఇబ్బందులు పడుతున్నాం



ఉపాధి జరిగే ప్రదేశంలో తాగునీరు కూడా ఉంచడం లేదు. బాటిళ్లలో నీరు తీసు కెళ్తున్నా అవి సరిపోవడం లేదు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి నీరు, నీడ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలి.

సాలేబాబు, ఉపాధి కూలీ, పుల్లలచెరువు

కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలి



ప్రస్తుతం ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున పనులు చేసేందుకు ఉపాధి కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పని ప్రదేశాల్లో కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించేలా చూడాలి. నీరు, నీడ, ప్రథమ చికిత్స కిట్‌లు ఏర్పాటు చేయాలి.

జానకి రఘు, వైఎస్సార్ సీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ

కూలీల సంఖ్య పెంచాలి



గ్రామాల్లో వ్యవసాయ పనులు దాదాపు ముగిశాయి. గ్రామాల్లో అడిగిన వారికి అధికారులు ఉపాధి పనులు కల్పించేలా చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా పుల్లలచెరువు, పెద్దారవీడు కరువు మండలాలు. పనులు భారీ ఎత్తున కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

గురునాథం, సీపీఐ మండల కార్యదర్శి, పుల్లలచెరువు

ఇంటర్ ద్వితీయ సంవత్సరం తరగతులు ప్రారంభం


పాఠ్య పుస్తకాలతో విద్యార్థులు

దొనకొండ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం క్లాసులు ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమయ్యాయని ప్రిన్సిపాల్ కె.దునుమణి తెలిపారు. ప్రతి కోర్సుకు సంబంధించిన అధ్యాపకులు అందుబాటులో ఉన్నారన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణ పేరుపై ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు ప్రతి విద్యార్థికి అందించనున్నట్లు పేర్కొన్నారు. ఏప్రిల్ 7 నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు అడ్మిషన్లు ప్రారంభమయ్యాయన్నారు. 10వ తరగతి పరీక్ష రాసిన విద్యార్థులకు బ్రిడ్జి కోర్సుపై తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. అంతేకాకుండా ఇంగ్లీష్ మీడియం, తెలుగు మీడియాల్లో సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

రైతు గుర్తింపు సంఖ్యపై అవగాహన


విశిష్ట గుర్తింపు సంఖ్యపై అవగాహన కల్పిస్తున్న ఏఓ

పెద్దారవీడు: భూమి ఉన్న ప్రతి రైతుకు ప్రత్యేక రైతు గుర్తింపు సంఖ్య ఆధార్ కార్డు తరహాలో ప్రభుత్వం అందిస్తోందని వ్యవసాయధికారి కె. బుజ్జిబాయి తెలిపారు. మండలంలోని చట్లమిట్ల, ఏనుగులదిన్నెపాడు గ్రామాల్లో రైతులకు ప్రత్యేక గుర్తింపు సంఖ్యపై మంగళవారం అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ పొలం ఉన్న ప్రతి రైతు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు రాయితీతో పొందాలంటే 11 అంకెల విశిష్ట సంఖ్య ఫార్మర్ రిజిస్ట్రీ తప్పని సరిగా చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వం ద్వారా పీఎం కిసాన్ చెల్లింపు, అన్నదాత సుఖీభవ, పంటల బీమా, పంట రుణాలపై వడ్డీ రాయితీ, వ్యవసాయ యంత్ర పరికరాలు, సూక్ష్మ పోషకాలు, సూక్ష్మసేద్యం, పంట రుణాలు, పెట్టుబడి సాయం తదితర పథకాలు నేరుగా రైతులు లబ్ధి పొందే అవకాశం ఉంటుందన్నారు. నీటి పారుదల, తెగుళ్ల నియంత్రణ, వాతావరణ సూచనలు వంటి ఇతర సేవలు అందుకోవడానికి ఎంతో తోడ్పడుతుందన్నారు. వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

కంభం చౌక్ సెంటర్‌లో ట్రాఫిక్


సత్యసాయి ఆలయం సమీపంలో ముందుకు వెళ్లే దారిలేక ఆగిన వాహనాలు

కంభం: పట్టణంలోని చౌక్ సెంటర్‌లో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ జఠిలమవుతోంది. కంభం ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి అర్ధవీడు రోడ్డు మలుపు వరకు సుమారు 30 అడుగుల వెడల్పుతో విశాలంగా ఉన్న రోడ్డు అక్కడి నుంచి కుంచించుకుపోతూ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్దకు వచ్చేసరికి 10 నుంచి 15 అడుగులు మిగిలింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. రోడ్డుకు ఇరువైపులా వస్త్ర దుకాణాలు, సైకిల్‌షాపులు, గోల్డ్ షాపులు, మెడికల్ షాపులు, ఇతర దుకాణాలు ఉన్నాయి. షాపులకు సంబంధించిన వస్తువులు రోడ్లపైకి ఉంచడం, ఎదురుగా ద్విచక్రవాహనాలు ఆపుతుండటంతో వాహనాల రాకపోకలకు తరచూ అంతరాయం ఏర్పడుతోంది. స్కూల్ బస్సులు, ఇతర పెద్ద వాహనాలు ఏవైనా వస్తే ముందుకు వెళ్లలేని పరిస్థితి. చౌక్ సెంటర్లో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


చౌక్‌సెంటర్‌లో ట్రాఫిక్ కారణంగా నిలిచిన స్కూల్ బస్సు

ఎస్‌హెచ్‌జీ సర్వే తనిఖీ


సర్వేను తనిఖీ చేస్తున్న పీడీ నారాయణ

తాళ్లూరు: మండలంలోని శివరాంపురంలో ఎస్‌హెచ్‌జీ సర్వేను డీఆర్‌డీఏ పీడీ నారాయణ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన 2025–26వ సంవత్సరానికి సంఘ సభ్యుల అవసరాలపై ఆరా తీశారు. సర్వే జరుగుతున్న తీరును స్వయంగా పరిశీలించారు. స్థానిక వీవో ఎన్యూమేరేటర్లతో మాట్లాడారు. సర్వేను ఎటువంటి అవకతవకలు లేకుండా నిర్వహించాలని సూచించారు. ఏపీఎం దేవరాజు, సీసీ మోహన్‌రావు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులపై శ్రద్ధ వహించాలి

యర్రగొండపాలెం: దివ్యాంగ విద్యార్థులపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని ఎంఈవోలు పి.ఆంజనేయులు, మల్లూ నాయక్ అన్నారు. మంగళవారం స్థానిక భవిత కేంద్రంలో దివ్యాంగ చిన్నారులకు ఏర్పాటు చేసిన ఫిజియోథెరపీ క్యాంపులో వారు పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో 10 మంది హోం బెస్ట్ అలవెన్స్, 19 మందికి గర్ల్స్ స్టైఫండ్, 19 మందికి ట్రాన్స్‌ఫోర్ట్ అలవెన్స్, 13 మందికి ఎస్కార్ట్ అలవెన్స్ దివ్యాంగుల తల్లి అకౌంట్‌లో జమ చేశారని, త్వరలో నలుగురికి వీల్ చైర్స్, నలుగురికి ఎమ్మార్ కిట్లు, ఒకరికి వినికిడి యంత్రం అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫిజియోథెరపీ వైద్యులు అంకారావు, ఐఆర్‌టీలు సురేష్, చెన్నకేశవులు, ప్రత్యేక ఉపాధ్యాయులు సాధిక్, హెచ్‌ఎం మల్లేశ్వరి పాల్గొన్నారు.

వైభవంగా శ్రీరాముని రథోత్సవం


ప్రత్యేక అలంకరణలో సీతారాములు

కొనకనమిట్ల: శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని గొట్లగట్టు, చినమనగుండం గ్రామాల్లో మంగళవారం సాయంత్రం నిర్వహించిన రాములోరి రథోత్సవం కనుల పండువగా సాగింది. సర్వాంగ సుందరంగా అలంకరించిన రథంలో సీతారాముల ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించి గ్రామంలో ఊరేగించారు. ముందుగా వేదపండితులు వినుపాముల రామకృష్ణశర్మ, శేఖరశర్మ పూజలు, పుష్పాభిషేకం చేశారు. ఉభయదాతలు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సీతారాములకు పట్టువస్త్రాలు సమర్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై రథోత్సవాన్ని తిలకించారు. జైశ్రీరామ్ నినాదాలతో గ్రామ వీధులు మారుమోగాయి. మహిళలు రథాన్ని లాగి భక్తిని చాటుకున్నారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో భక్తులకు పులిహోర, మజ్జిగ పంపిణీ చేశారు. రథోత్సవం అనంతరం వసంతోత్సవం, దొంగల దోపిడీ నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘ మహిళల కోలాట ప్రదర్శన, భక్తి గీతాలు భక్తులను అలరించాయి.


గొట్లగట్టులో రథోత్సవానికి హాజరైన భక్తులు

మృతుల కుటుంబాలకు బూచేపల్లి పరామర్శ


వెంకట సుబ్బమ్మకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి

దర్శి: నెడ్ క్యాప్ మాజీ డైరెక్టర్ సానికొమ్ము తిరుపతిరెడ్డి మాతృమూర్తి పెద్ద వెంకట సుబ్బమ్మ వృద్ధాప్యంతో మంగళవారం మృతి చెందారు. దర్శి ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆమె భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తిరుపతిరెడ్డికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. మండలంలోని తూర్పు వీరాయపాలెంలో మృతి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు ముప్పరాజు సుబ్బయ్య చౌదరి మృతదేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కొత్తరెడ్డిపాలెంలో మృతి చెందిన మూల వెంకటరెడ్డి మృతదేహానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి


విద్యార్థులకు టిఫిన్ వడ్డిస్తున్న ప్రిన్సిపాల్ ఈశ్వర్‌సింగ్

పెద్దదోర్నాల: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ పాఠశాల ప్రిన్సిపాల్ ఈశ్వర్‌సింగ్ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం పాఠశాలలోని వంట గది, డైనింగ్ హాల్‌తో పాటు పాఠశాల ప్రాంగణం తదితర విభాగాలను ఉపాధ్యాయులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరిచేరవని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు తాము వ్యక్తిగతంగా పరిశుభ్రంగా ఉండటంతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆరోగ్యమే మహాభాగ్యమని, ఆరోగ్యంగా ఉన్నప్పుడే చదువులో సైతం రాణిస్తారని చెప్పారు. క్రమం తప్పకుండా పాఠశాల, హాస్టల్లోని అన్ని విభాగాలను పరిశీలిస్తామని చెప్పారు. పాఠశాలకు సంబంధించి కాంపౌండ్ గోడ నిర్మాణం, ఎంట్రన్స్ గేట్‌ల సమస్య ఉందని, వాటి ఏర్పాటుకు సంబంధించి ఉన్నతాధికారులకు విజ్ఞప్తులు అందజేసినట్లు తెలిపారు. దీంతో పాటు పాఠశాలలో మరికొందరు ఉపాధ్యాయుల అవసరం ఉందన్నారు. వార్డెన్ నాగమణి, వైస్ ప్రిన్సిపాల్ వివేక్ సింగ్, నర్పత్ చౌదరి, సౌరభ్‌తో పాటు హెల్త్ అసిస్టెంట్ దయామణి పాల్గొన్నారు.

మొక్కుబడిగా ప్రజా దర్బార్


మాట్లాడుతున్న గొట్టిపాటి లక్ష్మి

దొనకొండ: స్థానిక సచివాలయం–1 ఆవరణలో మంగళవారం దర్శి టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి ఆధ్వర్యంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామాల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు వచ్చారేగానీ సమస్యల పరిష్కారం కోసం ప్రజలు కనపడలేదు. దీంతో ప్రజాదర్బార్ మొక్కుబడిగా ముగిసింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రెండు సార్లు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేశారు. అర్జీలను పరిష్కరించలేదని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పట్టించుకోకుండా కార్యాలయాల చుట్టూ తిప్పుతున్నారేగానీ ఏ ఒక్క అర్జీదారుని సమస్య పరిష్కరించలేదు. సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు తమ గ్రామాలకు మంచి నీరు లేవు, సాగర్ జలాలు రాలేదు, వేసవిలో సమస్య తీవ్రంగా ఉందని చెప్పారు. మరికొంత మంది డీప్ బోర్లు మరమ్మతులకు గురయ్యాయని, విద్యుత్ సమస్యపై పెదవి విరిచినా నేటికీ సమస్యలు పరిష్కరించలేదని గ్రామాల్లో ప్రజలు చాలామంది ప్రజా దర్బార్‌లో సమస్యలు విన్నవించేందుకు రాకపోవటం గమనార్హం. గ్రామాల్లోని ప్రజా సమస్యలు పరిష్కరించని ప్రజాప్రతినిధులు ప్రజా దర్బార్ నిర్వహించటం విడ్డూరంగా ఉందని చెప్తున్నారు. గొట్టిపాటి లక్ష్మి చేసేది లేక చివరకు అధికారులు, ప్రజాప్రతినిధులతో మాట్లాడి వెళ్లడంతో అంతటితో ప్రజా దర్బార్ ముగిసింది.

కంప్యూటర్ పరికరాలు అందజేత


కంప్యూటర్ పరికరాలు అందజేస్తున్న బీనా మోదీ

దర్శి: మండలంలోని చందలూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో మోడీ ఎంటర్ ప్రైజెస్ చైర్మన్ డాక్టర్ బీనా మోడీ పాఠశాలకు రెండు డెస్క్‌టాప్‌లు, ప్రింటర్, జిరాక్స్ మిషన్ అందజేశారు. ఈ సందర్భంగా బీనా మోడీ విద్యార్థులతో మమేకమై వారి విద్య గురించి, మౌలిక సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. పాఠశాలకు కావాల్సిన సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పీడీ అంజిరెడ్డి పాల్గొన్నారు.

కురిచేడు: మండలంలోని బోధనంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు జీపీఐ పొగాకు కంపెనీ అధినేత బీనామోడీ కంప్యూటర్, ప్రింటర్ కమ్ జిరాక్స్ మిషన్‌ను తన ప్రతినిధుల ద్వారా మంగళవారం అందజేశారు. గత నెలలో పర్యటనకు వచ్చిన ఆమె విద్యార్థుల అవసరాలు అడిగి తెలుసుకున్నారు. ఇచ్చిన మాట ప్రకారం అందజేసినట్లు జీపీఐ పొగాకు కంపెనీ డిప్యూటీ మేనేజర్ వినయ్‌కుమార్ తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థుల సమక్షంలో వాటిని అందజేసినట్లు తెలిపారు. పాఠశాల సిబ్బంది, విద్యార్థులు బీనామోడీకి, జీపీఐ కంపెనీ జీఎం ప్రభాకరరావు, రమేష్, రాజులకు కృతజ్ఞతలు తెలిపారు. జీపీఐ పొగాకు దర్శి ఏరియా మేనేజర్ ఎం.జగదీశ్వరరెడ్డి, ఎఫర్ట్ సంస్థ ప్రతినిధి డాక్టర్ హరిబాబు పాల్గొన్నారు.